తవ్వారు.. వదిలేశారు

- కాలువ లైనింగ్ చేయకుండానే పనులు నిలిపివేసిన వైనం
- చివరి ఆయకట్టుకు అందని సాగునీరు


కూరుకుపోతున్న కాలువ


సిమెంట్ పనులు చేయకుండా వదిలేసిన కాలువ

శంకరపట్నం: మెట్ట ప్రాంతంలోని గ్రామాలకు ఫ్లడ్ కెనాల్ నిధులు మంజూరైనప్పటికీ పనులు పూర్తి కాకపోవడంతో చివరి ఆయకట్టుకు సాగునీరు అందక పంటలు ఎండిపోతుతున్నాయి. రెండేళ్ల క్రితం ఫ్లడ్ ఫ్లో కాలువ నిధుల కింద ఉపకాలువలను పంట పొలాలలో తవ్వారు. ఉపకాలువల పనులు పూర్తి చేయకుండానే సదరు కాంట్రాక్టర్ మధ్యలోనే పనులు నిలిపి వేయడంతో చివరి ఆయకట్టుకు నీరందక పంటలు ఎండిపోయాయి. కాలువ పనులు పూర్తి చేసి పొలాలకు సాగునీరందిస్తేనే పంట పొలాలు సస్యశ్యామలం కానున్నాయి.

దశాబ్దాలుగా ఎదురుచూపు

వ్యవసాయబావులపై ఆధారపడి కరీంపేట రైతులు ఆరుతడి పంటలు పండిస్తున్నారు. ఎస్ఆర్ఎస్పీ కాలువ గ్రామం నుంచి కిందివైపు గుండా వెళ్లడంతో కొంతమంది రైతులు కాలువకు కరెంటు మోటార్లు బిగించి పంటలు సాగు చేసుకుంటున్నారు. రెండు దశాబ్దాలుగా కాలువ నీటికోసం ఎదురుచూస్తున్న కరీంపేట గ్రామ రైతులకు ఎఫ్ఎస్సీ పథకంలో కాలువ తవ్వకాలు చేపట్టడంతో ఆశలు చిగురించాయి. కాలువ తవ్వకాలు చేపట్టి లైనింగ్ చేయకపోవడంతో సాగునీరు అందడంలేదు. చివరి ఆయకట్టుకు సాగునీరందితేనె రైతుల బాధలు తీరనున్నాయి.

లైనింగ్ పనులు చేపట్టాలి



వరద కాలువతో పంట పొలాలకు సాగునీటిని అందించేందుకు ఉపకాలువ పనులు చేశారు. కాంట్రాక్టర్ సిమెంట్ లైనింగ్ పనులు చేయక పోవడంతో సాగు నీరందడం లేదు. పనులు పూర్తిచేసి వర్షాకాలంలో సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలి.

– గాండ్ల తిరుపతి, ఎంపీటీసీ, కరీంపేట

సాగునీరు అందించాలి



మెట్ట ప్రాంతమైన కరీంపేటకు వరద కాలువ నీటిని చివరి ఆయకట్టు వరకు విడుదల చేయాలి. కాలువ తవ్వకం కోసం రైతుల నుంచి భూసేకరణ చేసిన అధికారులు వెంటనే పనులను పూర్తి చేసి వర్షాకాలంలో పంటలకు నీరందించాలి.

– సంబు రమేశ్,రైతు, కరీంపేట

ముగిసిన ఆలయ వార్షికోత్సవాలు

గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేట గ్రామంలో మూడు రోజులుగా నిర్వహించిన మానసాదేవి ఆలయ వార్షికోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. చివరిరోజు కుంకుమార్చన, 51 కేజీల పసుపు, కుంకుమతో శ్రీచక్రానికి విశేష అభిషేకం, లక్ష తమలపాకులతో లక్ష్మీనరసింహుడికి అభిషేకం, శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కల్యాణం వంటి కార్యక్రమాలను అర్చకులు పెండ్యాల అమర్‌నాథ్‌శర్మ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. అలాగే ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సన్మానించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, ఆలయ గౌరవ అధ్యక్షుడు బద్దం చిన్న నర్సింహారెడ్డి, చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి, వైద్యులు బద్దం తిరుపతిరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ బద్దం సంపత్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు బొజ్జ తిరుపతి, తిప్పర్తి పరిపూర్ణాచారి, డైరెక్టర్లు, భక్తులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ బోనాలు

మండలంలోని గునుకులకొండాపూర్‌లో మంగళవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో శ్రీరేణుక ఎల్లమ్మ బోనాలు నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనాలతో డప్పుచప్పుళ్ల మధ్య ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీనాథ్‌రెడ్డి, టీపీసీసీ ఎస్ఈప రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్, మాజీ జెడ్పీటీసీ గూడెల్లి తిరుపతి, మాజీ సర్పంచులు లింగంపల్లి జ్యోతి, బేతెల్లి సమత, ఎంపీటీసీ ఫోరం మండల అధ్యక్షుడు గూడెల్లి ఆంజనేయులు, గౌడ సంఘం అధ్యక్షుడు న్యాలపట్ల పర్శరాంగౌడ్, కార్యదర్శి తాళ్లపల్లి రాజ్‌గౌడ్, టీడీపీ మండల అధ్యక్షుడు గుండా పర్శరాంగౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


గునుకులకొండాపూర్‌లో రేణుకా ఎల్లమ్మ బోనాలు


ఎమ్మెల్యే కవ్వంపల్లిని సన్మానిస్తున్న నాయకులు


చిగురుమామిడి: కల్యాణ వేడుకల్లో భక్తులు

శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణ వేడుకలు

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి గ్రామం ఊరగుట్టపై మంగళవారం శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గుట్టపై వెలసిన హరిహర క్షేత్రంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసస్వామి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కాగా ముందుగా స్వామివారి ప్రతిమలను బ్యాండ్ మేళాల మధ్య జంగ రాజయ్య–శ్యామల ఇంటి నుంచి చిన్నపిల్లల కోలాటం, నృత్యాల మధ్య గుట్టపైకి తీసుకెళ్లారు. ప్రత్యేకంగా వేసిన చలువపందిళ్ల కింద పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలతో స్వామివారి కల్యాణం కమనీయంగా జరిగింది. గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీనివాసస్వామి, ప్రధాన అర్చకులు ఆదిశేషువర్ధనస్వామి, ధర్మకర్తలు జంగ రాజయ్య, శ్యామల, బాలు, సత్య, శెట్టి బాలయ్య, శ్రీలత, గంధం జగదీశ్వర్, పావని, గాజుల సతీశ్, స్రవంతి రాములు, చంద్రకళ, సరళ పాల్గొన్నారు.

హనుమాన్ మాలధారణ

జమ్మికుంట: మున్సిపల్ పరిధి మారుతినగర్‌లోని పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో ఆలయ ప్రధాన అర్చకులు సముద్రాల ప్రసాదాచార్యులు సమక్షంలో హనుమాన్ భక్తులు మంగళవారం భక్తిశ్రద్ధలతో ఏకదశి హనుమాన్ మాలధారణ స్వీకరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. మాలధారణతో చెడు వ్యసనాలు దూరం అవుతాయని, సన్మార్గంలో నడిచేందుకు మంచి మార్గం ఏర్పడుతుందన్నారు. మూడు వందల మంది హనుమాన్ స్వాములు మాలధారణ గావించారు. అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఐలన్న, రాజేందర్, మహేందర్, లక్ష్మణ్, సంపత్ హనుమాన్ భక్తులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీకి నివాళి

రామడుగు: మండలంలోని వెదిరలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు మంగళవారం రాజీవ్‌గాంధీ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాలర్పించారు. కార్యక్రమంలో టీపీసీసీ ఎస్సీ డిపార్టుమెంట్ రాష్ట్ర కన్వీనర్ వెన్న రాజమల్లయ్య, నాయకులు పాల్గొన్నారు.

చిగురుమామిడి: కాంగ్రెస్‌పార్టీ మండలశాఖ అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు, నాయకులు కేక్ కట్ చేశారు. డీసీసీ ప్రధానకార్యదర్శి రవీందర్, జిల్లా అధికార ప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సైదాపూర్: మండల కేంద్రంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రాజీవ్‌గాంధీ చేసిన సేవలను కొనియాడారు. దేశానికి అందించిన టెక్నాలజీతో యువత ఉద్యోగ, ఉపాధి పొందుతున్నార అన్నారు.

హుజూరాబాద్: పట్టణంలోని పార్టీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నాయకులు, నాయకులు నివాళి అర్పించారు.



ఇల్లందకుంట: నివాళి అర్పిస్తున్న నాయకులు

వీణవంక: మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సీనియర్ నాయకులు ఎండీ సాహెబ్ హుస్సేన్ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ వర్ధంతి నిర్వహించారు.

ఇల్లందకుంట: మండల కేంద్రంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నాయకులు నివాళి అర్పించారు. చిన్న వయస్సులోనే ప్రధానిగా చరిత్ర సృష్టించారని అన్నారు. దేశానికి ఆయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు.

హామీలు నెరవేర్చాలి

మానకొండూర్: రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం భరతం పడతామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇనుగొండ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. మానకొండూర్‌లో నిర్వహించిన రైతు రణభేరి దీక్షలో మాట్లాడారు. రుణమాఫీ, పంక్వింటాల్‌కు రూ.ఐదు వందల బోనస్, కౌలు రైతులను ఆదుకుంటామని, భూమి లేని వారికి ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని అధికారంలోకి వచ్చి ఇప్పుడు మాట దాటవేసే ధోరణి అవలంభిస్తుందని మండి పడ్డారు. సన్నరకం వడ్లకే బోనస్ ఇస్తామని చెప్పడం రైతు వ్యతిరేక ప్రభుత్వానికి నిదర్శనమన్నారు. అన్నిరకాల వడ్లకు బోనస్ ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా ప్రధాన వెంకట్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులువెంకటరెడ్డి, రంగు భాస్కరాచారీ, తదితరులు పాల్గొన్నారు.


గంగాధరలో బీజేపీ నాయకుల నిరసన

గంగాధర: మండల కేంద్రంలో బీజేపీ నాయకులు రైతన్న కోసం– రణభేరి కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ చొప్పదండి అసెంబ్లీ నియోజక వర్గ కన్వీనర్ పెరుక శ్రావణ్‌కుమార్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్‌యాదవ్ హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలుల్లో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, జగిత్యాల జిల్లా ఉపాధ్యక్షుడు వేణు, జిల్లా కార్యదర్శి రామక్రిష్ణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ బల్లలు ధ్వంసం

హుజూరాబాద్ : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో వేసిన సిమెంట్ బల్లలను మద్యం బాబులు ధ్వంసం చేశారని వాకర్స్ తెలిపారు. బాస్కెట్ బాల్‌కోర్టు ఆవరణలో, వేపచెట్ల కింద ఉన్న సిమెంట్ కుర్చీలు, బల్లలను ధ్వంసం చేసి విద్యుత్ స్తంభాలకు ఉన్న స్విచ్‌బోర్డులను సైతం పగలగొట్టారని, పోలీసులు శ్రద్ధ వహించి మైదానంలో గస్తీ పెంచాలని, మద్యం బాబుల ఆగడాలను అరికట్టాలని కోరారు.

బీఆర్ఎస్ నాయకుల నిరసన

మానకొండూర్: ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని బీఆర్ఎస్ నాయకులు మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో నిరసన తెలిపారు. తడిసిన ధాన్యాన్ని పరిశీలించి రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. రైతు సంక్షేమమే ధ్యేయమని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం ఇప్పటివరకు కొనుగోళ్లు పూర్తిచేయలేదని జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్ మండిపడ్డారు. సన్నరకానికే బోనస్ ఇస్తామనడం సిగ్గు చేటన్నారు. రైతులు పండించిన ఏ ధాన్యానికైనా బోనస్ చెల్లించాల్సిందేనని అన్నారు. మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రైతులను ఆగం చేస్తే చూస్తూ ఊరుకోం

హుజూరాబాద్: రాష్ట్రంలో రైతులను ఆగం చేస్తే చూస్తూ ఊరుకోమని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.


ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

క్లుప్తంగా

అనుమతి లేని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

హుజూరాబాద్: అనుమతిని లేని ప్రైవేట్ పాఠశాలలపై అధికారులు చర్యలు తీసుకోవాలని, ఆ స్కూళ్లను మూసివేయించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారావు వెంకటేశ్ అన్నారు. మంగళవారం పట్టణంలో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారం చేస్తూ ఫీజుల పేరుతో రూ.లక్షలు దోచుకుంటున్నారని, ఎన్నికలల్లో విద్యార్థులకు ఇచ్చిన హామీలను విద్యాసంవత్సరం ప్రారంభం కాగానే అమలు చేయాలన్నారు.

విద్యుత్ లైన్లు తనిఖీ చేసిన నోడల్ అధికారి

శంకరపట్నం: మండలంలోని ముత్తారం, వంకాయగూడెం గ్రామాలలో 11కేవీ విద్యుత్ లైన్లను ఎన్పీడీసీఎల్, సీజీఎం, నోడల్ అధికారి రాజు చౌహాన్ మంగళవారం తనిఖీ చేశారు. విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు. వర్షాకాలంలోపు ఇబ్బందులు ఏర్పడకుండా లూజ్‌లైన్లు సరిచేయాలన్నారు. విద్యుత్ తీగలకు అంతరాయం కల్గించే చెట్ల కొమ్మలను తొలగించాలన్నారు. కొత్తగట్టు గ్రామంలో సిబ్బందితో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఈ గంగాధర్, డీఈ లక్ష్మారెడ్డి, ఏడీ శ్రీనివాస్, ఏఈలు సంపత్‌రెడ్డి, కుమారస్వామి పాల్గొన్నారు.

అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కేసులు

చిగురుమామిడి: మండలంలోని రామంచ మోయతుమ్మెద వాగు నుంచి అనుమతి లేకుండా చల్లూరి నరేశ్, ప్రకాశ్ అనే ఇద్దరు వ్యక్తులు ఇసుక అక్రమంగా తరలిస్తుండగా మంగళవారం పట్టుకొని కేసు నమోదు చేశామని ఎస్సై బి. రాజేశ్ తెలిపారు. ట్రాక్టర్లను సీజ్ చేశామని, అనుమతి తీసుకోకుంటే చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వ ఉద్యోగులపై సామాజిక మాధ్యమాల్లో అనుచిత పోస్టులు ఆధారాల్లేకుండా పెడితే చర్యలు తీసుకుంటామన్నారు.

ఆటోను ఢీకొన్న లారీ


లారీ వద్ద గ్రామస్తులు

శంకరపట్నం: మానకొండూర్ మండలంలో ఆటోను ఢీకొట్టిన లారీ ఆగకుండా కేశవపట్నం చేరుకునేలోపు గ్రామస్తులు అడ్డుకున్నారు. స్థానికుల వివరాలు.. కేశవపట్నం గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ రమేశ్ మంగళవారం ఆటోలో కరీంనగర్ వెళ్తుండగా, మానకొండూర్ సమీపంలో రాజస్తాన్‌కు చెందిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో స్వల్పంగా దెబ్బతింది. డ్రైవర్ లారీని ఆపకుండా వెళ్లిపోయాడు. ఈక్రమంలో రమేశ్ కేశవపట్నంలో ఉన్న బంధువులకు లారీ నంబర్ తెలుపగా వారు అడ్డుకున్నారు. బాధితుడికి రూ.4వేలు నష్ట పరిహారం ఇప్పించారు.

గీత కార్మికుడికి గాయాలు

మానకొండూర్: మండలంలోని మద్దికుంటలో మంగళవారం సాయంత్రం ప్రమాదవశాత్తు తాడిచెట్టుపై నుంచి పడటంతో గీత కార్మికుడు మల్యాల లక్ష్మయ్యగౌడ్‌కు(55) తీవ్రగాయాలయ్యాయి. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని గౌడ సంఘం నాయకులు కోరారు.

ఎన్జీటీ తీర్పు హర్షణీయం

వీణవంక: మానేరు నది ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌లు పర్యావరణ చట్టాలకు విరుద్ధమని ఎన్జీటీ తీర్పు ఇవ్వడం పట్ల ఎన్జీటీ పిటిషన్‌దారుడు సంధి సురేందర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం మండలంలోని మాల్లారెడ్డిపల్లిలో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మానేరు నదిపై చెక్ డ్యాములు నిర్మించకుండానే పూడికతీత పేరుతో కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లాల పరిధిలో ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేసి విధ్వంసానికి పాల్పడిందన్నారు. అందుకు విరుద్ధంగా మానేరు పరిరక్షణ సమితి దాఖలు చేసిన వివిధ పిటిషన్లను పరిష్కరిస్తూ ఎన్జీటీ సంచలనమైన తీర్పు వెలువరించిందన్నారు. అందుకు బాధ్యత వహిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మైనింగ్, టీఎస్ఎండీసీ విభాగాలు జరిమానా చెల్లించాలని ఆదేశించిందన్నారు. అంతేకాకుండా మానేరులో ఇసుక రీచ్‌లను రద్దు చేయించడానికి వెంటనే చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించిందన్నారు. తీర్పు అమలు నివేదిక సమీక్షను సెప్టెంబర్ 23వ తేదీకి వాయిదా వేసిందని తెలిపారు.

జమ్మికుంట: గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాలపై అధికారులు, నాయకులు మూల్యం చెల్లించుకోవాల్సిన సమయం వచ్చిందని, మానేరు నదిలో ఇసుక తవ్వకాలు చట్ట విరుద్ధమని ఎన్జీటీ తీర్పు హర్షణీయమని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ... ఇసుక మాఫియాతో కుమ్మక్కై రూ.వేల కొట్ల అక్రమాలకు పాల్పడిందని, రైతంగాం పక్షాన ఉద్యమించామని గుర్తు చేశారు. అక్రమాలకు పాల్పడిన అధికారుల నుంచి జరిమానా వసూలు చేసి, మానేరు తీర ప్రాంత బాధిత రైతాంగానికి నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. ఎన్జీటిలో పిటిషన్ వేసి మానేరు పరిరక్షణ సమితి పోరాటం చేసిన నాయకులు సురేందర్‌రెడ్డి, సతీశ్‌కుమార్‌ను అభినందించారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు

- ఇటుక బట్టీలకు చెరువు మట్టి తరలింపుపై విచారణ
- కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు

సాక్షి ఎఫెక్ట్..

జమ్మికుంట: మండలంలోని మాచనపల్లి గ్రామంలో ఉపాధి హామీలో చెరువు పూడికతీత పనులు జరుగుతున్నాయి. మట్టిని రైతుల పొలాల్లోకి కాకుండా ఇతరులకు అమ్ముతుండగా 'ఇటుక బట్టీలకు చెరువు మట్టి ' అనే కథనం 'సాక్షి' దినపత్రికలో సోమవారం ప్రచురితమైంది. స్పందించిన జమ్మికుంట ఎంపీడీవో భీమేశ్ మంగళవారం విచారణ చేపట్టారు. ఇటుక బట్టీల్లో నిల్వ చేసిన మట్టి కుప్పలను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో ప్రాథమిక విచారణ చేపట్టారు. చెరువు పూడిక మట్టి రైతుల పొలాల్లోకి కాకుండా ఇతర చోట్లకు తరలిస్తున్నారని, అందుకు కారణమైన పంచాయతీ కార్యదర్శి శివరంజని, ఫీల్డ్ అసిస్టెంట్లు అనురాధ పర్యవేక్షణ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు ఇద్దరికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ..చెరువు మట్టిపై అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించి హెచ్చరించారు.


విచారణ చేస్తున్న ఎంపీడీవో భీమేశ్


ఇటుక బట్టీలకు చెరువు మట్టి

'సాక్షి'లో ప్రచురితమైన కథనం

అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పరిశీలన

జమ్మికుంట: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో విద్యార్థుల సౌకర్యాల కోసం చేపట్టిన పనులు పూర్తి చేసి, పాఠశాలల ప్రారంభ దశకు సిద్ధం చేయాలని జిల్లా విద్యాధికారి సీహెచ్‌వీఎస్ జనార్దన్‌రావు అన్నారు. పట్టణంలోని చర్చి కాలనీ, ప్రాథమిక పాఠశాల, అబాధి జమ్మికుపంట ఉన్నత, ప్రాథమిక పాఠశాల్లోని పనులను మంగళవారం పరిశీలించారు. పట్టణ పరిధిలోని పాఠశాలల్లో నిర్మాణం చేపడుతున్నా కరెంట్, నీటివసతి, రిపేర్లు, టాయిలెట్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. అంతేకాకుండా జమ్మికుంటలోని అర్బన్, రూరల్ పాఠశాలలో జరుగుతున్న పనుల వివరాలు తెలపాలన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సదానందం, సమ్మయ్య, ప్రధానోపాధ్యాయులు పద్మ, పూర్ణచందర్, వనమాల, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ వరుణ్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ అకాశ్, సాయి, సీఆర్పీలు మహేందర్, సురేశ్, గుర్రప్ప, రవి తదితరులు పాల్గొన్నారు.

వీణవంక: మండలంలోని గొల్లపల్లి, మామిడాలపల్లి, ఇప్పలపల్లి, వీణవంక గ్రామాల్లోని అమ్మ ఆదర్శ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల పనులను డీఈవో జనార్దన్‌రావు పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఎంపీడీవో శ్రీధర్, ఎంఈవో విడువు శ్రీనివాస్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సంపత్, కుమారాచారి, పులి అశోక్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు విజయపాల్‌రెడ్డి, నాగిరెడ్డి, ఏఈ రమేశ్, వివో సునీత, సీఆర్పీ శ్రీనివాస్, సంపత్,కొమురయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.


వివరాలు తెలుసుకుంటున్న డీఈవో జనార్దన్‌రావు

రికార్డుల పరిశీలన


రికార్డులు పరిశీలిస్తున్న సంస్థ ప్రతినిధులు

చొప్పదండి: మండలంలోని ఆర్నకొండ గ్రామ పంచాయతీ రికార్డులను సిటిజన్ ఫర్ సివిల్ రైట్స్ సంస్థ మంగళవారం పరిశీలించింది. ప్రజలు చెల్లిస్తున్న పన్నులను, తిరిగి ఏ విధంగా ఖర్చు పెడుతున్నారో తెలుసుకునేందుకు సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకొని రికార్డుల తనిఖీ చేపట్టినట్లు సంస్థ సభ్యులు తెలిపారు. గ్రామ పంచాయతీలో రికార్డులను పూర్తి స్థాయిలో నిర్వహించకుండానే నిధులు ఖర్చు చేసినట్లు గుర్తించామని సభ్యులు తెలిపారు. పరిశీలనలో సభ్యులు సేపూరి రత్నాకర్, శివ చంద్రం, చంద్రకాంత్, భరద్వాజ్, సురేశ్, రవీందర్, రాము, సంజీవరావు పాల్గొన్నారు.

ఎంపీవో విచారణ


విచారణ చేస్తున్న ఎంపీవో సతీశ్‌కుమార్

జమ్మికుంట: మండలంలోని మడిపల్లి గ్రామంలో 2010లో జరిగిన అప్పటి అభివృద్ధి పనులపై డబ్బులు రికవరీ చేయాలని ఏప్రిల్‌లో మాజీ సర్పంచ్ మారపల్లి స్వామి కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా డీపీవో రవీందర్ ఆదేశాల మేరకు మండల ప్రజా పరిషత్ ఎంపీవో సతీశ్‌కుమార్ మంగళవారం గ్రామ పంచాయతీలో విచారణ చేపట్టారు. ఈసందర్భంగా ఎంపీవో మాట్లాడుతూ.. అప్పటి సర్పంచ్ మారపల్లి స్వామి సస్పెన్షన్‌కు గురికాగా ఆ సమయంలో గ్రామంలో ఉపసర్పంచ్ నేరేళ్ల సదానందం చేసిన పనుల్లో అవకతవకలు జరిగాయని ఫిర్యాదు చేశారని, ఇరువర్గాల వాఙ్మూలం, వివరాలు సేకరించామని నివేదికను ఉన్నతాధికారులు అందజేస్తామని ఎంపీవో తెలిపారు. గతంలో ఈ విషయంపై పలుమార్లు విచారణ జరిగినట్లు వివరించారు.

రామడుగు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా రామస్వామి

రామడుగు: రామడుగు మండల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా గొల్లె రామస్వామిని క్లబ్ సభ్యులు మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కాసారపు తిరుపతిగౌడ్, ఉపాధ్యక్షుడిగా ఓడ్నాల గంగారాజు, ప్రధాన కార్యదర్శిగా పంజాల వెంకటేశ్‌గౌడ్, కోశాధికారిగా షాబుద్దీన్, సంయుక్త కార్యదర్శిగా పన్యాల అశోక్‌రెడ్డి ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు.

ప్రభుత్వ భూమి కబ్జా


చదును చేసిన భూమి

మానకొండూర్‌రూరల్: మండలంలోని రంగపేట శివారులోని మల్లకుంటలో వెల్ది రెవెన్యూ పరిధికి చెందిన 16 ఎకరాల ప్రభుత్వ భూమిని కాంగ్రెస్ పార్టీకి చెందిన వ్యక్తులు కబ్జా చేశారని రైతులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. మంగళవారం తహసీల్దార్ రాజుకుమార్ సిబ్బందితో విచారణ చేపట్టారు. తుది నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిక



జమ్మికుంట: పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, గ్రామ పంచాయతీ మాజీ వార్డు సభ్యుడు చంద్రగిరి శ్రీనివాస్ హైదరాబాద్‌లోని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ సమక్షంలో మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా చంద్రగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. గతంలో కాంగ్రెస్‌లో పని చేశానని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కసుబోజుల వెంకన్న, చిన్నింటి నాగేంద్ర, తంగెళ్ల రాజు, చిక్కుడు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీలు సీజ్

జమ్మికుంట: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను మంగళవారం సీజ్ చేసి కేసు నమోదు చేశామ టౌన్ సీఐ రవి తెలిపారు. మండలంలోని విలాసాగర్ గ్రామ సమీపంలోని మానేరు పరివాహక ప్రాంతం నుంచి ఇసుకను లారీల్లో తరలిస్తుండగా నాగంపేట గ్రామ సమీంపంలో పట్టుకున్నామని, లారీ యజమానులు చందుపట్ల జితేందర్‌రెడ్డి, ముద్రకోల అశోక్, డ్రైవర్లు జాన ప్రశాంత్, ఇరుకుల్ల అంజయ్యపై కేసు నమోదు చేశామన్నారు.